కథ

# రెండో ముఖం

–సలీం

**రా**త్రి పదకొండు గంటలు. మేడ మీద పోర్షన్‌లోంచి పెద్దగా శబ్దం చేస్తూ ఏదో పడి భళ్ళున పగిలింది.





**కొ**ద్దిగా తెరిచి ఉన్న కిటికీలోంచి ఆమె ఏడుపు కీస్గరగా విన్పిస్తోంది. ఆగి ఆగి వస్తోన్న వెక్కిళ్ళ మధ్య ఆమె మాటలు ముద్దముద్దగా ఉండి అర్థం కావటం లేదు.

అతను పెళ్ళాన్ని రోజూ ఇలానే ఏడ్పిస్తున్నాడనుకుంటా. పైకి మెతగ్గా, అమాయకంగా కన్పిస్తే మంచివాడనుకున్నాం. ఎట్లా కనిపించినా మగవాడు కదా. ఆడదాని మీద జులుం చేయటం, పాశవికంగా హింసించటం అతని రక్తంలో తరతరాల నుంచి వారసత్వంగా వస్తూనే ఉంది.

ఆమె కెవ్వుమని అరిచింది. ఆ వెంటనే డబ్బుమని పడిన శబ్దం - కొట్టినట్లున్నాడు. రోజూ ఇలానే కొడ్తున్నాడేమో! ఎనిమిదింటికే భోంచేసి తొమ్మిది కల్లా పడుకునే మాకు ఇన్నాళ్ళూ తెలీనే లేదు.

ఈ రోజెందుకో నిద్రపట్టక వాలుకుర్చీ వేసు




కుని వసారాలో కూచున్నా. ఎండాకాలం కావటం వల్ల ఆకు కదలటం లేదు. ఆకాశం నిర్మలంగా ఉంది. వెన్నెల వన్నెల విసనకర్రలా ఒయ్యారాలు పోతోంది. ఇంత చిక్కటి వెన్నెలంటే నాకెంతిష్టమో! ఆయన్ని లేపుదామనుకున్నా, గురకపెడుతూ మొద్దు నిద్రపోతున్నాడు. పెళ్ళయిన క్షణం నుంచీ చూస్తూనే ఉన్నా. ఆయనంతే. ఓ అచ్చటా ముచ్చటా ఉండదు. బెల్లం కొట్టిన రాయిలా నిశ్చలంగా ఉంటాడు.

ఎప్పుడైనా నేను ముచ్చటపడి ''వెన్నెల చూశారా - ఎంత బావుందో'' అంటే ''నీకంటేనా'' అనో, అధవా ''అవునుస్మీ' అనో అంటాడనుకొంటే ''ఎప్పుడూ ఉండే వెన్నెలేగా - దానికోసం బంగారం లాంటి నిద్ర పాడు చేసుకోవాలా - నా వల్ల కాదు'' అని ఆపులించేస్తాడు.

మేడ మీదుండే అమ్మాయిని చూస్తే నాకు మా వారిజే గుర్తుకొస్తుంది. మా ఒక్కగానొక్క సంతానం. ఎంత అల్లారు ముద్దుగా పెంచుకున్నామో! కంప్యూటర్ ఇంజనీరింగ్ చదివించాము. అబ్బాయి అమెరికాలో సాఫ్ట్‌వేర్ కంపెనీలో పెద్ద ఉద్యోగం చేస్తున్నాడంటే ముచ్చటపడి అన్ని లాంఛనాలతో ఘనంగా పెళ్ళి చేశాం. మా దురదృష్టం! పైకి ఎర్రగా, బుర్రగా, సంస్కార వంతుడిలా కన్పిస్తే కామోసను కున్నాం కానీ కట్నంకోసం హింసించే కసాయి వాడని తెలుసుకోలేకపోయాం.

మరలా ఏడుపు విన్పించింది. నాకు వారిజ ఏడుస్తున్నట్టే అన్పించి దుఃఖంతో పాటు కోపం తన్నుకొచ్చింది. అతనేదో అంటున్న శబ్దం అస్పష్టంగా విన్పిస్తోంది. ఆమె పెద్దగా మాట్లాడుతోంది. మౌనంగా దుర్మార్గాన్ని సహించకుండా కనీసం గట్టిగా తన అసమ్మతిని తెలియజేస్తున్నందుకు సంతోషం వేసింది. మా వారిజకే నోట్లో నాలిక లేదు. ఎంత హింసించినా భరిస్తుంది తప్ప ఎదురు తిరగదు. నా ఖర్మ - అన్నీ ఆయన లక్షణాలే వచ్చాయి.

ఆయన రిటైరై ఇంట్లో ఉన్నా ఆర్థికంగా ఇబ్బంది లేకపోవడం వల్ల మేడమీది పోర్షన్‌ని అద్దెకు ఇవ్వాలని ఎప్పుడూ అనుకోలేదు. కానీ వీళ్ళిద్దరూ ''పిన్ని గారూ! మేడమీద పోర్షన్ అద్దెకిస్తారా'' అని అడిగినప్పుడు కాదనలేకపోయాను. ఆయన వద్దంటున్నా వినకుండా నేనే ఒప్పించి పైపోర్షన్ వాళ్ళకిప్పించాను. మాకు వాళ్ళిచ్చే అద్దె డబ్బులు అవసరం కాకున్నా నాకు నా కూతురూ అల్లుడు ఇంట్లో ఉన్నట్టేననిపించి ఒప్పుకున్నాను.

అబ్బాయి సన్నగా, పొడవుగా, తెల్లగా, నాజూగ్గా - ఆడపిల్లలా ఉంటాడు. ఏదో బ్యాంకులో ఉద్యోగం. అమ్మాయి అరవిరిసిన మందారపు మొగ్గలా ఉంటుంది. చాలా కలుపుగోలు మనిషి. ''పిన్ని గారూ! ఈ రోజు ఏం కూర చేస్తున్నారూ?'' అంటూ చనువుగా వచ్చి వంటింట్లో కూచుంటే నాకెంతిష్టమో...

''ఉలవచారు ఎలా పెట్టాలో చెప్తారా పిన్నీ'' అని ఓ రోజడిగితే నేనే చేసి పంపించాను. అరటి దూట కూర ఆవపెట్టి బొప్పాయి కూర చేయటం నేనే నేర్పాను. ఇవన్నీ చూసి ''ఇహనేం - కనకుండానే కూతురు దొరికిందిగా - బోల్డు కాలక్షేపం నీకు'' అంటూ ఆయన నవ్వేకటి.

ఎప్పుడైనా నలతగా ఉంటే ''ఈ వయసులో కూడా ఏం కష్టపడతారు పిన్నీ! మీరలా నడుం వాల్చండి. నేను చిటికెలో వండి తెస్తాను'' అని వంటంతా తనే చేసుకొచ్చేది.

పిచ్చిపిల్ల - ఎప్పుడూ మాటమాత్రంగానైనా మొగుడు కట్నం డబ్బుల కోసం వేధిస్తాడని చెప్పలేదు. ఎంతటి అభిమానవతో! మా వారిజలా...

వారిజా అంతే - పెళ్ళయిన ఏడాది వరకూ మాకెవ్వరికీ తెలియదు. దేశంకాని దేశంలో కనీసం మనసులోని బాధను చెప్పుకోడానికి మనుషులు లేక మాకు చెబితే మా గుండెలు ఎక్కడ బద్దలై పోతాయోనన్న భయంతో పిల్ల ఎలా అల్లాడిపోయిందో.

చలాకీగా - తుళ్ళిపడే జలపాతంలా ఉండే అమ్మాయి విషాదంలో ఒదిగి విరాగిలా మారిపోతే కారణం తెలీక నా తల్లి మనసు విలవిల్లాడిపోయింది. బుజ్జగించి, లాలించి అడిగితే చెప్పింది. రోజుల తరబడి మాట్లాడకుండా ముభావంగా ఉంటాడట. ఒక్కోసారి ఇంటికే రాడట. వారాల తరబడి పిల్ల ఆ ఇంట్లో జైలు జీవితం గడిపేదట. అంత చదువుకున్నాను కదా - నేనూ ఉద్యోగం చేస్తానంటే ఛస్ - వీలు కాదనే వాడట.

నాకు కన్నీళ్ళు వచ్చాయి. నా కూతురి జీవితంలా ఈ అమ్మాయి జీవితం కాకూడదనిపించింది.

ఆమె ఏడుపు మరీ బిగ్గరగా విన్పిస్తోంది.

మొదట ఆయన్ని లేపి, విషయం ఏమిటో కనుక్కురమ్మని పంపిద్దామనుకున్నాను. ప్చ్! ప్రయోజనం ఉండదు. ''మొగుడూ పెళ్ళాల గొడవ - మనకెందుకూ'' అని ముసుగుతన్ని పడుకుంటాడు.

వారిజ విషయంలోనూ అంతే. ''భార్యా భర్తలన్నాక ఏవో గొడవలు వస్తూ ఉంటాయి. వాళ్ళే సర్దుకు పోతారు. నువ్వు కలగజేసుకోవద్దు. అమ్మాయికే నచ్చచెప్పు. సంయమనం పాటించమను. అయినా మనం పోయాక ఈ ఆస్తంతా దానికే కదా వస్తుంది'' అనేవారు.

'మనం పోయేవరకూ ఆగలేడట. ఇప్పటికిప్పుడు మనమైనా పోవాలట లేదా అడిగినంత డబ్బైనా ఇవ్వాలట'' అని నేను ఆవేశపడిపోతే ''పోనీ - అలాగే చేద్దాం. అల్లుడన్నాక తప్పుతుందా మరి'' అనేవారు.

''అంటే ఇద్దరం ఇంత విషం తిని హరీ అందామా'' అని నేను విస్మయపోతే ''అది కాదు నేనన్నది. ఆస్తి అమ్మేసి అతనడిగినంత ఇచ్చేద్దాం. మనం ఇంకెంత కాలం బ్రతుకుతాం? అందాకా ఏ అద్దె కొంపలోనో కాలం వెళ్ళబుస్తే సరి'' అనేవారు.

వారిజే ఒప్పుకోలేదు. అర్థరహితమైన అతని ధన వ్యామోహాన్ని మౌనంగానే ఖండించింది చాన్నాళ్ళు - అతను చేయి చేసుకోవటం, నానా దుర్భాషలాడటం ఆరంభించాడు. అయినా కొన్నాళ్ళు సహించింది. నేనే తిరగబడమన్నాను. బానిసలా వాడి హింసను సహించవద్దన్నాను. వాణ్ణి ఎడంకాలి చెప్పుతో కొట్టి మన దేశం వచ్చేయమని చెప్పాను. తండ్రీ కూతుళ్ళు నా మాట వింటేగా - కాలమే వాడిలో మార్పు తెస్తుందని అన్నారు. భర్తను వదిలేసి వస్తే సమాజంలో తలెత్తుకుని తిరగలేమన్నారు.

పెద్దగా ఏదో శబ్దం! అతను అమ్మాయి పైకి

ఏదైనా వస్తువు విసిరేసి ఉంటాడు. లేదా మరలా కొట్టి ఉంటాడు.

నేను ఓ నిశ్చయానికొచ్చి లేచాను. మొదట పోలీసులకు ఫోన్ చేద్దామనుకున్నాను. ఆలోచిస్తే ఆ నిర్ణయం సరైంది కాదనిపించింది. నా స్నేహితురాలు మల్లమ్మకు చెప్పాను. ఆమె గత పాతికేళ్ళుగా స్త్రీల విముక్తి కోసం పోరాడుతోంది. స్త్రీల సమస్యల గురించి చాలా పుస్తకాలు కూడా రాసింది. స్వత హాగా లాయర్ కావటం వలన ఇతన్ని కోర్టుకీడ్చిగాని నిద్రపోదు.


వారిజ విషయంలో కూడా ఇలాంటి నిర్ణయం తీసుకుని ఉండాల్సింది. అక్కడే పొరపాటు చేశాను. స్వంత కూతురి జీవితం అనేప్పటికి మెత్త బడ్డాను.

నేను అమ్మాయితో వాడికి విడాకులిచ్చేసెయ్య మని చెప్పినప్పుడల్లా ''వద్దమ్మా - సర్దుకు పో. పిల్లలు పుడితే అంతా బావుంటుంది'' అని చల్ల బరిచే వారీయన. నెలలో పాతిక రోజులు ఏదో ఓ సాకుతో అలిగి, పోట్లాడి మంచానికి అటు వైపు తిరిగి పడుకుని సాధించే అతని వల్ల పిల్లలెలా పుడ్తారో నాకర్థం కాలేదు.

వారిజ కష్టాలు గుర్తొచ్చి నాకు ఆవేశం తన్ను కొచ్చింది. ఏదిఏమైనా సరే ఈ అమ్మాయిని నేను ఆదుకోవాలని నిర్ణయించుకున్నాను. ''మీకు అద్దె తోనే సంబంధం - మా స్వంత విషయాల్లో జోక్యం చేసుకునే అధికారం లేదు'' అని ఆ అబ్బాయి అంటే ఏం చేయాలని ఓ క్షణం ఆలోచించాను. ''ఆడపిల్ల కదాని హింసిస్తే చూస్తూ ఊర్కోను. ఆమె తల్లిదం డ్రులు ఎక్కడో ఉన్నారులెమ్మని రెచ్చిపోతున్నావేమో - అమ్మాయికి అండగా నేనున్నాను. భార్యను కొట్టడం నేరం. మరోసారి ఇలా జరిగితే నీకు అర దండాలు ఖాయం'' అని స్ట్రాంగ్‌గా డోస్ ఇవ్వాలని నిర్ణయించుకున్నాను. ఆ తర్వాత మల్లమ్మకు విష యం వివరించి ఆమె సలహా ప్రకారం చేయడం మంచిది.

మరలా పెద్దగా ఏడుపు - ఇక ఊరుకుంటే లాభం లేదని కొంగు నడుముకు బిగించి దృఢ నిశ్చ యంతో మెట్లెక్కాను. ''పెద్దగా ఏడవకు - అందరికీ విన్పిస్తుంది'' అంటున్నాడతను. వీడు హింసించిన విషయం పది మందికీ తెలియకూడదని మనసారా ఏడ్చే స్వాతంత్ర్యాన్ని కూడా హరిస్తున్నాడు. ఆమె వెక్కిళ్ళు బలంగా విన్పిస్తున్నాయి.

మొదట మెల్లగా తలుపు తట్టాను. వాళ్ళున్న పరిస్థితుల్లో ఇలా లాభంలేదని గ్రహించి ''అమ్మా య్'' అంటూ తలుపు గట్టిగా బాదాను. అరని మిషం ఆగాక తలుపు తెరుచుకుంది. నన్ను చూసి




''పిన్నిగారూ!'' అంటూ అమ్మాయి నన్ను పట్టు కుని వలవలా ఏడుస్తుంటే ఎలా సముదాయించాలో నాకు అర్థం కాలేదు. దుర్మార్గుడు-పిల్లనెంత హింసిం చాడో - వాడివైపు నిప్పులు కక్కుతూ చూశాను. మొహం చూడు - ఎంత అమాయకంగా, బేలగా పెట్టాడో? గోముఖ వ్యాఘ్రం. ఈ పిల్లా ఈమె తల్లి దండ్రులూ మోసపోయారేమో కాని నేను మాత్రం వీణ్ణి నమ్మను.

''ఊర్కోమ్మా - ఏడవకు - నేనున్నానుగా. ఈ మగవాళ్ళంతా ఇంతే. ఆడవాళ్ళ మీద జులుం చేయడం వాళ్ళ జన్మహక్కు అనుకుంటారు'' అన్నా ను బుజ్జగిస్తూ.

గదినిండా వస్తువులు చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. అమ్మాయి జుట్టు ముడి ఊడి ఉంది. తలలో తురుముకున్న మల్లెపూలు నేలపైన చిందర వందరగా విసిరేసి ఉన్నాయి. జుట్టు పట్టుకుని కొట్టి ఉంటాడు - రాక్షసుడు.

''మా వల్ల మీ నిద్ర పాడైనట్టుంది. సారీ. అప్ప టికీ చెప్తూనే ఉన్నాను. అరిచి రాద్ధాంతం చేయవద్దని వింటేనా'' అన్నాడతను.

మాటల్లో వినయం నటిస్తున్నాడు. వినయం ధూర్త లక్షణం కదా.

''అంటే నువ్వేమన్నా నోరు మెదపకుండా ఉండాలంటావ్! అరిస్తే నీవెలా పిల్లని రాచిరంపాన పెడ్తున్నావో మాకు తెలుస్తుందని నీ భయం. అసలు నువ్వు మనిషివేనా? అపురూపంగా చూసుకోవాల్సిన అమ్మాయిని ఏడ్పిస్తావా?'' అనాలనుకున్న నాలుగూ అనేశాను.

''అలా అడగండి పిన్ని గారూ!'' అందా అమ్మాయి కళ్ళు తుడుచుకుంటూ.

''అసలేమైందంటే...'' అంటూ ఏదో చెప్ప బోతున్న అతన్ని అడ్డుకున్నాను. ''నువ్వేం మాట్లా డకు. నీ మొహం చూసి చాలా మంచివాడి వనుకున్నాను. ఇలా ఆడపిల్ల ఉసురు పోసుకునే అందరిలాంటి మగవాడివని ఇప్పుడే అర్థమైంది'' అంటూ దులిపేశాను.

''వారం నుంచి అడుగుతున్నాను పిన్నిగారూ పుట్టింటికి పంపించమనీ. నాకు మా అమ్మ గుర్తొ స్తోంది-ససేమిరా అంటున్నారు'' అందా అమ్మాయి మరలా గుడ్లనీరు కుక్కుకుంటూ.

నేను గతుక్కుమన్నాను.

''మీరే చెప్పండి. తను వెళ్ళిపోతే నాకు ఇబ్బంది కదా. నేనూ వెళ్దామంటే శెలవు దొరకటం కూడా కష్టం. ఎంత బ్రతిమాలినా వినటం లేదు. మంకు పట్టు పట్టింది'' అన్నాడతను.

''ఈ చెల్లాచెదరైన పూలూ, వస్తువులూ...'' అనుమానంగా అడిగాను.

''తన మాట వినలేదని తనే పూలన్నీ తెంపి కిందవేసేసింది. ఇలా చూశారా? ఈ గిన్నెలు కోపం తో నా పైకి విసిరేసింది. క్రికెట్ ఆడే అలవాటుంది కాబట్టి దెబ్బ తగలకుండా ఒడుపుగా పట్టుకోగలి గాను కానీ లేకపోతేనా...'' అన్నాడతను నవ్వుతూ.

''ఓ నెల ఆగమనండి. నేను పిల్చుకెళ్తాను. తను ఒక్కతే వెళితే ఆమెనొదిలి ఉండలేక ...'' నేల చూపులు చూస్తూ నసిగాడు.

''వీల్లేదు. నేను పుట్టింటికి రేపు వెళ్ళాల్సిందే'' అందా అమ్మాయి ఖరాఖండిగా.

నేను మెల్లగా అక్కడి నుంచి బైటపడ్డాను.

ఇంకా నయం! అనుకున్నవన్నీ చేసి భంగప డ్డాను కాదు.

మెట్లు దిగుతూ అనుకున్నాను. ఆడవాళ్ళే హింసకు గురవుతున్నారనుకోవటం తప్పు. హింసిం చే ఆడవాళ్ళూ ఉన్నారు.